నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I హైదరాబాద్, శనివారం 24 ఆగస్టు 2024 SANGAREDDY

# రుణమాఫీ కాకపాయే..

- మెదక్ ఎమ్మెల్యే సొంతూరిలో మాఫీకి నోచుకోని రైతులు
- జంగారాయి సొసైటీలో 24 మందికి వర్తించని మాఫీ
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

మెదక్, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ): మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సొంతూరు చిన్నశంకరంపేట్ మండలం కొర్విపల్లిలో చాలామంది రైతులకు మూడో విడత రుణమాఫీ వర్తించకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకమంది రైతుల పేర్లు మాఫీ జాబితాలో గల్లంతయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు సమాచారం కోసం బ్యాంకులు, కార్యాలయాల వద్దకు పరుగులు తీస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఏదో ఒకటి సర్దిచెప్పి పంపిస్తున్నారు. కొర్విపల్లికి చెందిన రైతులు జంగరాయి సొసైటీలో రుణాలు తీసుకున్నారు. ఈ సొసైటీలో 54మంది లోన్లు తీసుకోగా, ఇప్పటివరకు 30మందికి మాత్రమే మాఫీ అయ్యింది. మిగతా వారికి రుణ మాఫీ కాకపోవడంతో సొసైటీ కార్యాలయం వద్దకెళ్లి సిబ్బందిని అడగ్గా, తాము జాబితాను ప్రభుత్వానికి పంపినట్లు సమాధానం ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. రుణమాఫీకి రేషన్‌కార్డు ప్రామాణికం కాదని సీఎం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రేషన్‌కార్డు యూనిట్‌గా రుణమాఫీ చేస్తుండడంతో ఇప్పటికే చాలామందికి అన్యాయం జరిగింది. రేషన్‌కార్డు లేని వారికి అసలు మాఫీ జరగలేదు. దీనిపై వ్యవసాయాధికారులను సంప్రదిస్తే రేషన్‌కార్డు లేనోళ్లకు సర్వే చేసిన తర్వాత మాఫీ చేస్తారని చెబుతున్నారు. లిస్టులో పేర్లున్నప్పటికీ కొందరు రైతులకు రుణాలు మాఫీ కాలేదు. బ్యాంకులకు వెళ్లి అడిగితే ప్రాసెస్‌లో ఉంది రేపో.. ఎల్లుండో పడుతుందని చెబుతున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### మాఫీ కోసం ఎదురు చూస్తున్నా



రుణమాఫీ జాబితాలో నాపేరు రాలేదు. నేను చిన్న శంకరంపేట డీసీసీబీలో 2019లో లక్షా ఇరవై వేల అప్పు తీసుకున్నా. అప్పటి నుంచి రెగ్యులర్‌గా రెన్యువల్ చేశాను. అయినా నాకు మాఫీ వర్తించలేదు. మాఫీఅయ్యేలా చూడాలని అధికారులను కోరుతున్నా.

–మోకిరే బాలమల్లు, రైతు, కొర్విపల్లి

### ఎనిమిది వేలు కడితేనే మాఫీ వస్తదంట



చిలిపిచెడ్,ఆగస్టు 23: నేను చిట్కుల్ ఏపీజీవీలో రూ.1.60లక్షల క్రాప్ లోన్ తీసుకున్నా. మూ డు నెలల కిందనే బ్యాంకుకు వెళ్లి క్రాప్‌లోన్ రెన్యువల్ చేస్తానని చెబితే.. ఇప్పుడు వద్దు త్వరలో రెండు లక్షల పంట రుణమాఫీ వస్తది ఎందుకు కడతావు అన్నారు. వడ్డీతో కలిసి ఇప్పుడు రెండు లక్షల ఎనిమిది వేలు ఉన్నాయి. ఎనిమిది వేలు కడితే మాఫీ అయితాయి అని బ్యాంక్ అధికారులు చెప్పడంతో కట్టా. మూడో విడతలో కూడా పేరు రాలేదు. రెగ్యులర్‌గా రుణాలు చెల్లించిన వాళ్లకే పంట రుణమాఫీ కావడం లేదు.

– తేజానాయక్, రైతు,గన్యాతండా గౌతాపూర్, చిలిపిచెడ్ మండలం, మెదక్ జిల్లా

### లక్ష రూపాయల లోన్ మాఫీ కాలే

కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీపై గొప్పలకు పోతున్నది. నాకున్న రెండెకరాల భూమిపై ఎస్‌బీఐ బ్యాంకులో రూ.70వేల రుణం తీసుకున్న. వడ్డీతో కలిపి అప్పు లక్ష రూపాయలు అయ్యింది. రేవంత్‌రెడ్డి లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తాడని సంతోషపడ్డా. నాకు ఇంకా లక్ష రూపాయల రుణమాఫీ కాలేదు. బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారులను అడిగినా ఎందుకు రుణమాఫీ కాలేదో సరిగ్గా జవాబు చెప్పడం లేదు. నాకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా.

-కుమ్మరంగు జంగయ్య, రైతు,కాశీపూర్

### రుణమాఫీ చేయలేదు



బెజ్జంకి, ఆగస్టు 23 : నాకు మా గ్రామ శివారులో ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. నేను మూడు సంవత్సరాల కింద రూ.1.20 లక్షల పంట రుణం తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం పంటరుణమాఫీ చేయలేదు. ప్రభుత్వం స్పందించి నాకు రుణమాఫీ చేయాలి.

-లక్ష్మి, మహిళా రైతు వీరాపూర్, బెజ్జంకి మండలం, సిద్దిపేట జిల్లా

### అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు



బెజ్జంకి, ఆగస్టు 23 : గ్రామంలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. నేను ఇండియన్ బ్యాంకులో 2022లో రూ.3 లక్షల రుణం తీసుకున్నా. ప్రభుత్వం పంటరుణమాఫీ చేస్తున్నామని చెప్పుతున్నా నాకు ఇంకా పంటరుణమాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే మీకు రుణమాఫీ కాలేదన్నారు. కొన్నిరోజులు ఆగాలే ఆతర్వాత స్పష్టత వస్తది అనిచెబుతున్నారు.

-రడం బాలయ్య, రైతు,వీరాపూర్, బెజ్జంకి మండలం, సిద్దిపేట జిల్లా

### అర్హత ఉన్నా రుణమాఫీ కాలేదు



చిలిపిచెడ్,ఆగస్టు 23: నేను,నా భార్య కలిపి చిట్కుల్ ఏపీజీవీలో రూ.1.97లక్షల రుణం తీసుకున్నాము. మూడో విడతలో కూడా పంట రుణమాఫీ కాలేదు. ఈ విషయంపై వ్యవసాయాధికారులను అడిగితే మీ బ్యాంకు పుస్తకంలో పేరు తప్పుగా ఉన్నది అని చెప్పారు. బ్యాంక్ అధికారులను అడిగితే బ్యాంక్ పుస్తకంలో పేరు సరిగ్గా ఉన్నదని చెబుతున్నారు. ఇద్దరి మధ్య ఎవరిది తప్పు ఉందని అడిగితే ఎవరూ సమాధానం చెప్పడం లేదు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

-ఎండీ.ఖాసీం, రైతు,చండూర్ గ్రామం, చిలిపిచెడ్ మండలం, మెదక్ జిల్లా

### త్వరలో మాఫీ అవుతుందంటున్నారు



శివ్వంపేట, ఆగస్టు 23:గోమారంలోని ఏపీజీవీబీలో ఇద్దరి పేరు మీద రూ. రెండు లక్షల 31 లేలు పంటరుణం తీసుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పంటరుణమాఫీలో మా ఇద్దరిలో ఒక్కరికి కూడా మాఫీ కాలేదు. ఇదేంటని మండల వ్యవసాయ కార్యాలయానికి వచ్చి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నాం. ఇద్దరిలో ఒక్కరికి మాత్రమే త్వరలో మాఫీ అవుతుందని అధికారులు చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కార్డు అనుసంధానం లేదంటూనే ఒక్కరికే మాఫీ చేస్తాం అనడం దుర్మార్గం.

-కల్లెం సత్తిరెడ్డి, భారతమ్మ దంపతులు, నవాబుపేట,శివ్వంపేట మండలం, మెదక్ జిల్లా

### రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేసిండు



మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 23: సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు రైతులందరికీ అప్పు మాఫీ చేస్తమని చెప్పి, ఇప్పుడేమో కొంతమందికి మాత్రమే అప్పులను మాఫీ చేసిండు. అప్పుడేమో రైతులెవరూ బ్యాంకుల్లో అప్పులు కట్టొద్దు అని చెప్పిండు. ఆయన మాటలు నమ్మి అప్పులు కట్టపోతే ఆ అప్పులు ఇప్పుడు కుప్పలుగా అయినయి. కుప్పలుగా అయిన అప్పులు మాఫీ అయితయి అనుకుంటే మాఫీ కాలేదు. ఇప్పుడు మేము ఏంచెయ్యాలి. రేవంత్‌రెడ్డిని నమ్ముకుంటే రైతులకు అప్పులే మిగిలినయి. బ్యాంకుల్లో అప్పులు ఉన్నోళ్లకు మొత్తం అప్పులు మాఫీ చేయాలి లేదంటే కాంగ్రెస్ సర్కారుకు రైతులు గట్టి గుణపాఠం చెబుతారు.

-ముస్త్యాల శ్రీనివాస్, నర్సాయపల్లి, మద్దూరు మండలం, సిద్దిపేట జిల్లా



సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు

# రైతుల ఆశలు ఆవిరేనా..!

- నిండని సింగూరు ప్రాజెక్టు
- ఈ ఏడాది ఒకటిన్నర టీఎంసీలకు మించి రాని వరద
- గతేడాది ఇదే సమయంలో ప్రాజెక్టులో 24 టీఎంసీలు
- ప్రస్తుతం ప్రాజెక్టులో 15.222 టీఎంసీల నీటినిల్వ
- ప్రాజెక్టులో 20 టీఎంసీల నీరుంటేనే సాగునీటి విడుదల
- పంటలు ఎలా దక్కించుకోవాలో అని రైతుల ఆందోళన



సంగారెడ్డి జిల్లాలో నీరు లేక వెలవెలబోతున్న సింగూరు ఎడమ కాల్వ

పుల్కల్, ఆగస్టు 23: మరోవారం రోజులు గడిస్తే వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు గడిచిపోతుంది. కానీ, సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో జలాలతో నిండక పోవడంతో ఆయకట్టు రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. వరినాట్లు వేసి సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రాజెక్టు నిండేదెప్పుడు మా పంటలు పండేదెలా అని రైతులు ఆవేదన చెందుతున్నారు. గతేడాది ఆగస్టు 23వ తేదీ నాటికి ప్రాజెక్టులో 24 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 15.222 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ప్రాజెక్టులోని 20 టీఎంసీల నీటిమట్టం చేరితే కాని సాగుకు వదలలేని పరిస్థితి. ఈసారి తాగునీటికి తప్పా సాగుకు నీరందడం కష్టమే అనిపిస్తున్నది. సింగూరు ప్రాజెక్టు కాలువలను నమ్ముకుని వరినాట్లు వేసిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఏటా కెనాల్ ద్వారా 44 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తారు. కానీ, ఈసారి ఎగువ ప్రాంతాల్లో వర్షాలు లేక ప్రాజెక్టు లోకి అనుకున్నంతగా వరద రాలేదు. అడపాదడపా ముసురు వర్షాలు పడినప్పటికీ 2 టీఎంసీల నీరు మాత్రమే ప్రాజెక్టులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇలాగైతే మా పంటలు పండేదెలా..పంటల కోసం తెచ్చుకున్న అప్పులు సైతం తీర్చేదెలా అంటూ రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఆగస్టు చివరి వారం లేదా, సెప్టెంబర్ మొదటి వారం వరకైనా ప్రాజెక్టులోకి సరిపడా వరద వస్తే తమ పంటలు గట్టెక్కుతాయని రైతులు ఆశపడుతున్నారు.సింగూరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.222 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 1942 క్యూసెక్యులు, ఔట్‌ఫ్లో 391 క్యూసెక్కులు వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో తాలెల్మ లిఫ్ట్ ఇరిగేషన్‌కు 31 క్యూసెక్యులు, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌కు 80 క్యూసెక్కులు, మిషన్ భగరీథ కోసం 70 క్యూ సెక్కులు, 210 క్యూసెక్కుల నీరు వృథా అవుతున్నట్లు అధికారులు తెలిపారు.

# రైతులకు ప్రయోజనకారిగా ఆర్‌వోఆర్ చట్టం

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్ ఐడీవోసీ కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : ప్రజలకు, రైతులకు ప్రయోజనకారిగా ఉండేలా ఆర్‌వోఆర్ చట్టాన్ని తెచ్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఆర్‌వోఆర్ ముసాయిదా చట్టం-2024 అమలుపై వివిధ వర్గాల ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకునేందుకు ఏర్పాటు చేసిన చర్చా వేదికలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, మెదక్ ఆర్డీవో రమాదేవితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రైతుల ఇబ్బందులు గుర్తించిన ప్రభుత్వం అందరితో సమాలోచన చేసి చట్టం తెచ్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ చర్చా వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన హక్కుల రికార్డు బిల్లు- 2024 రూపకల్పన సందర్భంగా న్యాయవాదులు, రైతులు, రైతు సంఘాలు, రైతులు, ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, సిబ్బంది, మేధావులు ఇలా అన్నివర్గాల ప్రజల అభిప్రాయ సేకరణకు చర్చా వేదిక నిర్వహించినట్లు తెలిపారు. ఈ చట్టం రూపకల్పనలో క్షేత్రస్థాయిలో ప్రజల సూచనలు, సలహాలను తీసుకోవాలని, ఈ నూతన ముసాయిదా చట్ట రూపకల్పనలో భాగంగా అభిప్రాయ సేకరణలో ఇచ్చిన సలహాలు, సూచనలు ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్‌వోఆర్ చట్ట రూపకల్పనలో భాగంగా ప్రభుత్వం అభ్యంతరాలు సలహాలు, సూచనలకు వెబ్‌సైట్ అందుబాటులోకి తెచ్చిందని, వెబ్‌సైట్‌లో మీ సలహాలు, సూచనలు అందజేయాలని ఆయన సూచించారు.సమావేశంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోవింద్, అన్ని మండలాల తహసీల్దార్లు, న్యాయవాదులు, రిటైర్డు ఉద్యోగులు, రైతు సంఘాల నాయకులు, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఆర్‌వోఆర్ చట్టం 2024పై వర్క్‌షాప్

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 23: సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్ మనుచౌదరి అధ్యక్షతన తెలంగాణ ప్రభుత్వ నూతన ఆర్‌వోఆర్ 2024 ముసాయిదా బిల్లుపై చర్చా వేదికను నిర్వహించారు. ఈ వేదికలో కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ నూతన ఆర్‌వోఆర్-2024 ముసాయిదా బిల్లు మేధావులకు, అడ్వకేట్లకు,ప్రజాప్రతినిధులకు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు, విలేకరులకు, ప్రజలకు అవగాహన కల్పించి చట్టంలో పొందుపర్చాల్సిన 20 అంశాలపై వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకోవడానికి చర్చావేదిక నిర్వహించినట్లు తెలిపారు. ఈ చర్చా వేదికలో మీరు ఇచ్చిన సలహాలు, సూచనలు ప్రతి ఒక్కటి రికార్డు చేశామని, వాటిని ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్ రామ్మూర్తి, కలెక్టర్ ఏవో రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

# సాంకేతిక కారణాలు చూపి గోసపెట్టొద్దు



సంగారెడ్డి కలెక్టరేట్ ఏవో పరమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

### రైతులందరికీ పంటరుణమాఫీ చేయాలని సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ధర్నా

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 23: చిన్నచిన్న సాంకేతిక కారణాలు చూపి మెజార్టీ రైతులకు రుణమాఫీ వర్తింపజేయక పోవడం తగదని, రైతులందరికీ షరతులు లేని రుణమాఫీ చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి జయరాజు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఏవో పరమేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలో సుమారు 2.50 లక్షల మంది రైతులు ఉంటే, ఇప్పటి వరకు మూడు విడతల్లో కేవలం 97,873 మంది రైతులకు మాత్రమే రూ. 846.31 కోట్ల రుణమాఫీ అయిందని వివరించారు. ప్రభుత్వం ఎన్నికల ముందు రూ.2 లక్షల రుణమాఫీ ఇస్తామని చెప్పి ఇప్పుడు రేషన్ కార్డు పరిగణలోకి తీసుకోవడంతో అనేక మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదన్నారు. ఆధార్, బ్యాంక్ ఖాతా, పట్టాపాస్ బుక్‌లో తప్పులు ఉన్న రైతులకు రుణమాఫీ రాకపోవడం రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, సాంకేతిక సమస్యలను కారణంగా చూపుతూ రైతులందరికీ రుణమాఫీ చేయకపోవడం సరికాదన్నారు. సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు రుణమాఫీ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఆందోళనలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, జైపాల్‌రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, రాజిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, భూషణం, మల్లేశం, లక్ష్మణ్ పాల్గొన్నారు.



కంకరతేలిన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం గడితోటకు వెళ్లే రహదారి

# కంకర తేలిన రహదారి

### ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

చేర్యాల, ఆగస్టు 23: రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు రోడ్ల నిర్మాణం, మరమ్మతుల పై నిర్లక్ష్యం వహిస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు అవసరమైన తాగునీరు, సాగు నీరు, రైతులకు పెట్టుబడి అందించడంతో పాటు వారు పండించిన పంటలు నేరుగా మార్కెట్లకు తీసుకుపోయేందుకు వీలుగా రోడ్ల నిర్మాణాల పై ప్రత్యేక దృష్టి సారించారు. కోట్లాది రూపాయలతో బీటీ, సీసీ రోడ్లు నిర్మించారు. కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలో అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు రోడ్ల నిర్మాణం కోసం పైసా మంజూరు చేయలేదని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. పట్టణ శివారు గడితోటకు వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా తయారై నడవడానికి వీలు లేని పరిస్థితి నెలకొన్నది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కల్వర్టులు లేక కష్టాలు



సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని కాజ్‌వే కుంగిపోయి గుంత ఏర్పడడంతో చేరిన వర్షపు నీరు

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 23: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని కూటిగల్-సోలిపూర్ గ్రామాల మధ్య ఉన్న రెండు కాజ్‌వేలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న కాజ్‌వేలకు మరమ్మతులు చేయించడంలో అధికారులు విఫలమయ్యారు. వర్షాకాలం వస్తే ప్రయాణికులు సదరు కాజ్‌వేలపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. కొన్నేండ్ల క్రితం నిర్మించిన కాజ్‌వేలు దెబ్బతినడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో వర్షపునీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కాజ్‌వేల పక్క నుంచి వెళ్దామంటే సదరు రోడ్డు సైతం కోతకు గురైంది. వర్షాలు బాగా పడితే ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిస్థాయిలో నిలిచిపోతున్నాయి. గతంలో కాజ్‌వేల వద్ద పలువురు వాహనదారులు కిందపడి తీవ్రంగా గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కాజ్‌వేల స్థానంలో కల్వర్టులు నిర్మించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సింగూరు ప్రాజెక్టుకు స్వల్ప వరద

పుల్కల్,ఆగస్టు 23 : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టులోకి స్వల్ప వరద వస్తున్నది. శుక్రవారం ఇన్‌ఫ్లో 1907 క్యూసెక్యులు, అవుట్ ఫ్లో 391 క్యూ సెక్యుల కొనసాగినట్లు అధికారులు తెలిపారు. తాలెల్మ లిఫ్ట్ ఇరిగేషన్‌కు 31 క్యూసెక్యులు, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌కు 80 క్యూసెక్కులు, మిషన్ భగరీథ కోసం 70 క్యూసెక్కులు, వృథాగా 210 క్యూసెక్కుల నీరు వెళ్తున్నట్లు తెలిపారు. గతేడాది ఇదే సమయంలో ప్రాజెక్టులో 20 టీఎంసీల నీరు ఉండగా, ప్రస్తుతం 15.222 టీఎంసీల నీరు ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు ఒకటిన్నర టీఎంసీల వరద ప్రాజెక్టులో వచ్చిందన్నారు. ప్రాజెక్టులో నీటి సామర్థ్యం 20 టీఎంసీల నీరు నిల్వ ఉండకపోవడంతో సింగూరు కెనాల్ కింద సాగు చేస్తున్న వరి నాట్లకు సైతం నీటి వదలకపోతున్నట్లు అధికారులు వెల్లడించారు. సాగుకు నీటిని వదలక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




సిద్దిపేట జిల్లా దుద్దెడ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన మోడల్ బస్టాండు నేడు నిరుపయోగంగా మారింది. చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో బస్టాండ్ మొత్తం అధ్వానంగా తయారైంది. కొంతమంది బస్టాండ్‌లో నివాసం ఉండడంతో అటువైపు బస్సులు వెళ్లడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

–నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట జిల్లా, ఆగస్టు 23